

# నిఫ్టీ.. 4700 కీలకం



పి.జయప్రకాష్

దేశీయ కంపెనీల మొదటి త్రైమాసిక ఫలితాలను గమనించిన వారెవరికైనా ఈపాటికి దేశ ఆర్థిక వ్యవస్థ సత్తా ఏమిటో తేటతెల్లమై ఉంటుంది. ప్రపంచమంతా మాంద్యం గుప్పిట్లో చిక్కుకొని అల్లాడుతున్న సమయంలో మన దేశీయ కంపెనీలు మాత్రం అద్భుత ఫలితాలను ప్రకటించాయి. మన పారిశ్రామికవేత్తల శక్తిసామర్థ్యాలను చూసి అభినందించకుండా ఉండలేం. భారత ఆర్థిక వ్యవస్థ పరుగు 2003లో మొదలైందనే విషయం గుర్తుండే ఉంటుంది. గత ఆరేళ్లలో 8.5 శాతం చొప్పున సగటు వృద్ధి నమోదైంది. పొరుగున ఉన్న చైనా మనకంటే 15ఏళ్లు ముందుగానే సంస్కరణల బాటను ఎంచుకుంది. తత్ఫలితంగా అత్యంత వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించి ప్రపంచంలో మూడో స్థానాన్ని అందుకుంది. ఇప్పుడు గుర్తించాల్సిందేమింటే... చైనా కంటే మనమేం తక్కువ కాదు. వచ్చే కొన్నేళ్లలోనే మనదేశం కూడా చైనా వేగాన్ని అందుకుంటుంది. ఈ మార్పును మనం స్టాక్ మార్కెట్‌కు అన్వయించుకుని చూడాలి...

వచ్చే కొన్నేళ్ల పాటు మన ఆర్థిక వ్యవస్థ సగటున 7 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉంది. అంటే కార్పొరేట్ ఆదాయాలు మూడు రెట్లు అధికంగా 21 శాతం పెరుగుతాయి. అదే జరిగితే నిఫ్టీ (ఎన్ఎస్ఈ సూచీ) పయనం ఇలా ఉంటుంది.

| దశ | కనిష్ఠ | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|---|
| 2003- 2008 | 900 | 6350 | 2500 (గతం) |
| 2008- 2013 | 2500 | 12500 | 6250 (వర్తమానం) |
| 2013- 2018 | 6250 | 25000 | 12500 (భవిష్యత్తు) |

ప్రస్తుత బుల్ మార్కెట్ దశలో నిఫ్టీ 12500 గరిష్ఠ స్థాయిని, ఆ తర్వాత దిద్దుబాటువల్ల 6250 సూచీని చూసే అవకాశం ఉంది. ఆ తర్వాత దశలో 6250 కనిష్ఠ స్థాయి నుంచి 25,000కు నిఫ్టీ ఎదగవచ్చు. ఈ అంకెలు కచ్చితం కాకపోయినా కొన్ని పరిమితులకు లోబడి ఇలా జరిగేందుకే అవకాశాలు హెచ్చుగా ఉన్నాయి. అందువల్ల మదుపుదార్లు నిస్సందేహంగా బంగారం, రియల్ ఎస్టేట్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వంటి ఇతర పెట్టుబడి మార్గాల కంటే స్టాక్ మార్కెట్ వైపు మొగ్గు చూపవచ్చు. ఒక్కో కంపెనీ షేరును విశ్లేషించి పెట్టుబడి పెట్టడం కష్టం అనుకుంటే 'నిఫ్టీ బీస్' మీద పెట్టుబడి పెడితే సూచీ పెరుగుదలకు తగ్గట్లుగా ప్రతిఫలం లభిస్తుంది.

## 6400కు చేరేముందు..

ఈ నేపథ్యంలో ప్రస్తుత మార్కెట్ గమనాన్ని విశ్లేషిద్దాం. 2007 నుంచి ఇప్పటివరకూ నిఫ్టీ (ఎన్ఎస్ఈ సూచీ) చార్టును చూస్తే... 2008 జనవరిలో చరిత్రాత్మక గరిష్ఠ స్థాయి అయిన 6350ని నిఫ్టీ నమోదు చేసింది. అక్కడి నుంచి 2008 అక్టోబరులో 2500 పాయింట్లకు పతనమైంది. గతంలో నమోదు చేసిన చరిత్రాత్మక గరిష్ఠ స్థాయిని అందుకునే ప్రయత్నాన్ని మళ్లీ ఇప్పుడు నిఫ్టీ చేస్తోంది. ప్రాథమిక విశ్లేషణ, సాంకేతిక విశ్లేషణ ప్రకారం చూస్తే 4700 స్థాయి కీలకమైనదిగా అర్థం అవుతోంది. ఈ స్థాయిని నిఫ్టీ ఇప్పటికి ఆరుసార్లు అందుకుంది. మరికొంతకాలం ఇదేస్థాయి వద్ద ఉండి, తిరిగి 6400 పాయింట్లకు చేరే దారిపడుతుంది.

## ఓర్పు, నేర్పుతోనే సాధ్యం

స్టాక్ మార్కెట్ విజయాలు ఒక్కరోజులో వచ్చేవి కావు. ఎంతో ఓపిక, సహనానికి తోడు నేర్పు ఉండాలి. జనామోదం పొందిన పద్ధతుల ప్రకారం మార్కెట్‌ను, ఒక్కో షేరును విశ్లేషించాలి. సరైన సమయంలో కొనుగోలు, విక్రయ నిర్ణయాలు తీసుకోవాలి. అప్పుడే గెలుపు సాధ్యపడుతుంది. ఏళ్ల తరబడి స్టాక్ మార్కెట్ పితామహులనదగ్గవారు అనుసరించిన విశ్లేషణా పద్ధతులు... మదుపుదార్లకు ఈ పయనంలో అండగా నిలుస్తాయనే విషయాన్ని విస్మరించరాదు. ప్రధానంగా మూడు రకాల పద్ధతులను ఇక్కడ ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. అవి: 1) ప్రాథమిక విశ్లేషణ 2) సాంకేతిక విశ్లేషణ 3) ప్రవర్తన (బిహేవియర్) విశ్లేషణ. వీటిలో ఏ ఒక్క విధానాన్నో కాకుండా మూడింటినీ అనుసరించేవారు విజయం వైపు ఉంటారని చెప్పవచ్చు.

(రచయిత హైదరాబాద్‌లోని
ఆర్ఎల్‌పీ సెక్యూరిటీస్ డైరెక్టర్)